సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

అభివృద్ధికి సహకరించండి..

ప్రభుత్వం అండగా ఉంటుంది

కొడంగల్, ఆగస్టు 3 : అభివృద్ధికి సహకరించండి.. ప్రభుత్వం అండగా ఉంటుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం వికారాబాద్ కలెక్టరేట్‌లో కొడంగల్ ప్రాంత అభివృద్ధి అథారిటీ కింద అభివృద్ధి పనులను చేపట్టేందుకు భూసేకరణ నిమిత్తం మండలంలోని అప్పాయిపల్లి రైతులతో ప్రత్యేకంగా మీటింగ్ నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ భూసేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా భూమిని కోల్పోయిన ప్రతి రైతుకూ 125 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించి.. అభివృద్ధి చేసి ఇస్తామన్నారు. ఈ భూముల్లో వైద్య, నర్సింగ్, పశువైద్య కళాశాలలు ఏర్పాటు కానున్నాయని.. తద్వారా అప్పాయిపల్లి గ్రామం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. వ్యాపారపరంగానూ ఈ ప్రాంతం ప్రగతిపథంలో ముందుంటుందని.. కొడంగల్ అభివృద్ధికి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులు తమ అభిప్రాయాలను మెమోరాండం ద్వారా కలెక్టర్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ అధికారి పూర్ణచంద్రారావు, డీఎంహెచ్‌ఎస్ డాక్టర్ ప్రదీప్‌కుమార్, కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్, అప్పాయిపల్లి రైతులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం తనిఖీ

వికారాబాద్ : ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం, మున్సిపల్ పరిధిలోని అనంతగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలోని ధరణి సహాయక కేంద్రాన్ని, రికార్డు గదిని కలెక్టర్ పరిశీలించారు. దవాఖాన ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అక్కడి అధికారులకు సూచించారు. దవాఖాన ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని డీఎంహెచ్‌వో పల్వన్‌కుమార్‌కు సూచించారు. చికిత్స నిమిత్తం వచ్చిన బాలుడి అనారోగ్యంపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

వారం రోజుల్లోగా

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరిస్తాం

రంగారెడ్డి, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ) : ధరణి పెండింగ్ దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యమిచ్చి సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ సూచించారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై శనివారం హైదరాబాద్‌లోని సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్‌మిట్టల్ మాట్లాడుతూ ధరణి సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా రూపొందించిన నూతన ఆర్‌ఓఆర్ ముసాయిదా బిల్లు-2024పై ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు సీసీఎల్‌ఏ వెబ్‌సైట్ (www. ccla. telangana. gov. in) ద్వారా అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఈ నెల 2 నుంచి 23వ తేదీ వరకు ఈ ముసాయిదా బిల్లుపై ప్రజలు ఎవరైనా సరే.. తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి చెప్పొచ్చని.. సలహాలు, సూచనలను ఈ మెయిల్ (ror2024-rev@ telangana. gov.in) ద్వారా తెలపొచ్చన్నారు. అదేవిధంగా పోస్ట్ ద్వారా కూడా ల్యాండ్ లీగల్‌సెల్, సీసీఎల్‌ఏ కార్యాలయం, నాంపల్లి, స్టేషన్‌రోడ్, అన్నపూర్ణ హోటల్ ఎదురుగా, ఆబిడ్స్, హైదరాబాద్ 500001 చిరునామాకు పంపించవచ్చునని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శశాంక మాట్లాడుతూ జిల్లాలో జూన్ 30 వరకు వచ్చిన దరఖాస్తులను వారంలోగా పరిష్కరిస్తామని.. ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో లేకుండా వారం వ్యవధిలో పే పరిష్కరిస్తామన్నారు. మ్యుటేషన్స్, కోర్టు కేసులకు సంబంధించిన దరఖాస్తులనూ పెండింగ్‌లో లేకుండా చర్య లు తీసుకుంటామన్నారు.

ధరణి దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

అధికారులతో కలెక్టర్ సమీక్ష..

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ శశాంక ఆర్డీవో లు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఎల్‌ఏ కమిషనర్ సూచనల మేరకు వీలైనంత త్వరగా పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారి స్థాయిల్లో పెండింగ్‌లో ఉ న్న దరఖాస్తులను మూడు నుంచి నాలుగు రోజుల్లోపే క్లియర్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో అతి తక్కువ శాతం దరఖాస్తులను పరిష్కరించిన మండలాలైన యా చారం, మంచాల, మాడ్గుల, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, కందుకూరు, గండిపేట తహసీల్దార్లు దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులపై రివ్యూ చేసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించిన ప్రగతిపై రోజువారీగా పరిశీలన జరపాలని ఆర్డీవోలకు సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఆర్డీవోలు సూరజ్‌కుమార్, అనంత్‌రెడ్డి, సాయిరాం, వెంకట్‌రెడ్డి, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో వసతులు కల్పించాలి

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులను త్వరితగతిన కల్పించాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ శశాంక..జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి, సీడీపీవోలతో అంగన్‌వాడీల్లో మౌలిక వసతుల కల్పనపై మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,600 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయని, జిల్లాలో 7 ప్రాజెక్టుల ద్వారా 95వేల మంది పిల్లలకు, 18వేల మంది బాలింతలకు అవసరమైన పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. అదేవిధంగా కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణానికి కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకుని.. నిర్మాణాలను త్వరగా పూర్తిఅయ్యేలా సీడీపీవోలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల అప్‌గ్రేడ్ ప్రక్రియను కూడా పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టుకు ఒకటి చొప్పున ఈ నెల 15 వరకు తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, అప్‌గ్రేడ్ పనులు పూర్తి అయ్యేలా సీడీపీవోలు చొరవ చూపాలన్నారు. సీడీపీవోలు, ఇంజినీర్ అధికారులు సమష్టిగా కలిసి పని చేయాలన్నారు. సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మజారమణ, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, హయాత్‌నగర్, ఆమనగల్లు, శేరిలింగంపల్లి, షాద్‌నగర్, చేవెళ్ల సీడీపీవోలు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఆగస్టు 3: జిల్లాలో విద్యార్థులకు ఇబ్బంది కలిగించినా.. ర్యాగింగ్ చేసినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి హెచ్చరించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో జిల్లాలో పనిచేస్తున్న షీటీమ్స్, భరోసా కేంద్రం, కళాజాత బృందాల అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. జిల్లాలో భరోసా కేంద్రం, షీటీమ్స్, కళాజాత బృందాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. మహిళలు, బాలికలను ఇబ్బందిపెడితే తమ కోసం షీటీమ్స్ బృందాలు ఉన్నాయని.. ఎవరైనా లైంగిక వేధింపులకు గురిచేస్తే భరోసా కేంద్రం అధికారులు ఉన్నారనే విషయాన్ని జిల్లాలోని ప్రతి గ్రామంలో నివసించే మహిళలు, బాలికలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎవరైనా షీటీమ్స్, భరోసా కేంద్రం అధికారులకు ఫిర్యాదు చేస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని..ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ డీఎస్పీ ప్రశాంత్‌రెడ్డి, షీటీమ్స్, భరోసా, కళాజాత బృందాల అధికారులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

బొంరాస్‌పేట : తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న సంక్షేమ శాఖ అధికారిణి వెంకటేశ్వరమ్మ

- వికారాబాద్ జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి వెంకటేశ్వరమ్మ

బొంరాస్‌పేట, ఆగస్టు 3 : తల్లి పాలతో బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుం దని.. పుట్టిన వెంటనే బిడ్డకు తప్పక తల్లి పాలు ఇవ్వాలని వికారాబాద్ జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి వెంకటేశ్వరమ్మ అన్నారు. శనివారం బొంరాస్‌పేట లోని మూడోనంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిపాలలో ఎన్నో పోషక విలువలు ఉంటాయని, తల్లి పాలతో బిడ్డకు ఎలాంటి వ్యాధులు రావని, రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. రెండేండ్లవరకు తల్లులు తమ బిడ్డలకు తప్పక తల్లిపాలు ఇవ్వాలన్నారు. పిల్లలకు 7వ నెల నుంచి అనుబంధ ఆహారం అం దించాలని సూచించారు. ముర్రుపాలు ఇవ్వడం విషయంలో ఉన్న అపోహ లను తొలగించి గ్రామీణ ప్రాంతాల్లో మహిళలను చైతన్యం చేయాలని అంగ న్‌వాడీ టీచర్లకు సూచించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించి ప్రతి నెలా వారి బరువును తీసి తల్లిదండ్రులకు తెలపాలన్నారు. 3-5 ఏండ్ల వయసున్న చిన్నారులకు ఆట పాటల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువు నేర్పించాలని.. ఆరేండ్లు నిండిన తర్వాతే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఐటీ కో-ఆర్డినేటర్ హర్షితారెడ్డి, సూపర్‌వైజర్ మంజుల, జయశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు వెంకటమ్మ, కల్పన, జీవన జ్యోతి, షాహిన్, వివిధ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎలాంటి సమస్యలుండొద్దు

- స్వచ్ఛదనం-పచ్చదనాన్ని సక్సెస్ చేయాలి
- వికారాబాద్ అదనపు కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి సుధీర్

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, ఆగస్టు 3 : స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని వికారాబాద్ అదనపు కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి సుధీర్ అన్నారు. శనివారం వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల ఐదు నుంచి తొమ్మిదో తేదీ వరకు గ్రామాల్లో రోజువారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. ప్రతి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి గ్రామాల్లో ఎలాంటి సమస్యలేకుండా పరిష్కరించాలన్నారు. సమావేశానికి గైర్హాజరైన ప్రత్యేక అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పనులు సక్రమంగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. ఈ ప్రోగ్రామ్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు నిధులను మంజూరు చేయాలన్నారు. జనవరి నుంచి ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు నిధులు రావడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వినయ్‌కుమార్, ఏవో జ్యోతి, ఎంపీవో దయానంద్ , తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంఈవో బాబుసింగ్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని జేసీబీలతో కూల్చివేయిస్తున్న అధికారులు

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం

- కూల్చివేతకు అధికారుల యత్నం
- నెలరోజుల్లో కూల్చివేస్తామని నిర్వాహకుల హామీ
- వెనుదిరిగిన ఆఫీసర్లు

బొంరాస్‌పేట, ఆగస్టు 3: దుద్యాల మండల కేంద్రానికి సమీపంలో తాండూరు-మహబూబ్‌నగర్ రహదారికి పక్కన ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన రైస్‌మిల్లును కూల్చివేసేందుకు శనివారం అధికారులు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న యాజమానులు నెల రోజుల్లో ఆ నిర్మాణాన్ని తొలగిస్తానని అధికారులకు రాతపూర్వకంగా రాసివ్వడంతో వారు వెనుదిరిగారు. వివరాల్లోకి వెళితే.. దుద్యాల గ్రామ శివారులో సర్వేనంబర్ 1090లో 1.02 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. దానిలో 9 గుంటల భూమిని ఆక్రమించుకుని కొడంగల్ మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రైస్‌మిల్లును నిర్మించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో శనివారం డీపీవో జయసుధ, తాండూరు డీఎల్‌పీవో శంకర్‌నాయక్, దుద్యాల తహసీల్దార్ దానయ్య పోలీస్ బందోబస్తుతో ఆ అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసేందుకు రెండు జేసీబీలతో వెళ్లారు. కొద్దిభాగంలో జేసీబీలతో కూల్చివేస్తుండగా.. యజమానులు వచ్చి తమకు నెల రోజుల సమయం కావాలని, ప్రభుత్వ భూమిలో అక్రమం గా నిర్మించిన నిర్మాణాన్ని తొలగిస్తామని రాతపూర్వకంగా రాసి ఇవ్వడంతో అధికారులు అక్కడి నుంచి వెనుతిరిగారు.

కొహెడ కళ కళ!

- లే అవుట్‌కు మెరుగులు
- వేలానికి సిద్ధం చేసేలా.. మౌలిక వసతులు

సిటీబ్యూరో, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): హెచ్‌ఎండీఏ పరిధిలో భూముల వేలానికి కాంగ్రెస్ సర్కారు సన్నద్ధమవుతున్నది. హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేసిన లే అవుట్లలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలంలోని కొహెడ వద్ద సర్వేనం. 507లోని లే అవుట్‌లో వసతులు కల్పించేందుకు కార్యాచరణను మొదలుపెట్టింది. మరో 8-10 నెలల్లోనే అభివృద్ధి చేసిన లేఅవుట్ ప్లాట్లను విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నది. కొన్ని ప్లాట్లను ఇప్పటికే ఓఆర్‌ఆర్ నిర్వాసితులకు కేటాయించగా మిగిలినవి అమ్మేందుకు వీలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ఈ లేఅవుట్‌లో మౌలిక వసతుల కల్పనకు టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేసింది. అంతర్గత రోడ్లు, మురుగునీటి కాల్వలు, తాగునీరు, అండర్ గ్రౌండ్ విద్యుత్తు సరఫరా వంటి సౌకర్యాలు కల్పించనున్నది. కాగా, హెచ్‌ఎండీఏ పరిధిలో భూముల వేలానికి యోచిస్తున్న సర్కారు .. ఆగస్టులో సవరించనున్న మార్కెట్ ధరకు అనుగుణంగా ఈ వేలంలో ప్లాట్లను విక్రయించేలా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఆ లోపు మౌలిక వసతుల కల్పన పూర్తి చేసేలా హెచ్‌ఎండీఏ అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో నిర్వహించిన వేలంపాటలో మిగిలిన ప్లాట్లను కూడా దశలవారీగా మార్కెట్‌లో పెట్టనున్నారు.

రయ్..రయ్..

ఒకే నంబర్‌తో..

రెండు రాష్ట్రాల్లో దర్జాగా ప్రయాణం

శంషాబాద్ రూరల్, ఆగస్టు 3 : కొన్నేండ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకే నంబర్‌తో కూడిన ప్లేట్‌తో ఓ వ్యక్తి క్యాబ్‌ను నడిపిస్తున్నాడు. కొందరు క్యాబ్ డ్రైవర్లు అతడిని గుర్తించి.. పట్టుకున్నారు. స్థానిక క్యాబ్ డ్రైవర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ 26టీఈ 4974తో ఏపీలో.. అదే నంబర్‌తో తెలంగాణలో టీఎస్ 26 టీఈ 4974 నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఓ వ్యక్తి.. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చే ప్రయాణికులను తీసుకెళ్తున్నాడు. అయితే వారం రోజులుగా విమానాశ్రయానికి ఒకే వ్యక్తి రెండుమూడు సార్లు రాకపోకలు సాగించడంతో అనుమానం వచ్చిన శంషాబాద్‌కు చెందిన క్యాబ్ డ్రైవర్లు..అతడిని పట్టుకోవడంతో అసలు విషయం బయటపడింది. కారు తోపాటు డ్రైవర్‌ను ట్రాఫిక్ పోలీసులకు అప్పగించారు. విచారణ చేసి..చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు చెప్పినట్లు క్యాబ్ డ్రైవర్లు తెలిపారు. పట్టుబడిన సదరు వ్యక్తి దాదాపు పదేండ్ల నుంచి ఇలాగే తిరుగుతున్నట్లు వివరించారు. ఇలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆర్‌టీఏ అధికారులను కోరారు.

నేతన్న బీమా పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, ఆగస్టు 3 : రంగారెడ్డి జిల్లాలోని చేనేత, అనుబంధ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నేతన్న బీమా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు చేనేత, జౌళిశాఖ హైదరాబాద్/రంగారెడ్డి జిల్లాల సహాయ సంచాలకురాలు ఇందిర శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకంలో చేరేందుకు చేనేత, అనుబంధ కార్మికులు అర్హులని.. గతేడాది ఈ పథకంలో చేరని వారు చేనేత జౌళి శాఖ కార్యాలయం, హైదరాబాద్‌లో 08.08.2024లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకంలో పేరు నమోదు చేయించుకున్న కార్మికులు ఏదైనా కారణంతో మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5లక్షల బీమా వస్తుందన్నారు. 18-59 ఏండ్ల వయసు కలిగిన కార్మికులు వారి పాస్‌పోర్టు సైజుఫొటో, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్, నామినీ ఆధార్‌కార్డ్, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లతో చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో దరఖాస్తును సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ నాయకుడి మృతి

ఆమనగల్లు, ఆగస్టు 3 : ఆటోను కారు ఢీకొట్టిన ప్రమాదంలో పులిగోనిపల్లి తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు రమేశ్‌నాయక్ మృతి చెందాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి విఠాయిపల్లి హనుమాన్ ఆలయ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రమేశ్‌నాయక్ శనివారం సాయంత్రం ఆమనగల్లు పట్టణం నుంచి పులిగోనిపల్లి తండాకు ఆటోలో వెళ్తుండగా.. అదే సమయంలో హైదరాబాద్ నుంచి ఆమనగల్లు వైపు వెళ్తున్న కారు ఆటోను ఢీకొట్టగా.. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రమేశ్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటేశ్ తన సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించి.. మృతుడి భార్య సీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీలో చురుగ్గా ఉండే రమేశ్‌నాయక్ మృతి పార్టీకి తీరని లోటని పలువురు బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

నందిగామ, ఆగస్టు 3 : మండలంలోని రంగాపూ ర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. రంగాపూర్ గ్రామానికి చెందిన జాకారం మహేశ్(37) శుక్రవారం ఇంట్లో ఎవ రూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య మాధవి ఇచ్చి న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొలాలకెళ్లే రోడ్డును కబ్జా చేశారని ఫిర్యాదు

పొలాలకు వెళ్లే రోడ్డును కబ్జా చేశారని పలువురు రైతులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని బస్వాపూర్ గ్రామం నుంచి బంట్వారం వెళ్లే పురాతన దారిని సర్వేనంబర్-178లో పుష్పలతారెడ్డి, వెంకట్‌రెడ్డి కబ్జా చేసి, రోడ్డును తొలగించారని గ్రామానికి చెందిన పలువురు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు. -బంట్వారం, ఆగస్టు 3

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

- శంకర్‌పల్లి మండలంలోని కొండకల్ వద్ద ఘటన
- హెచ్చరిక బోర్డులు లేకపోవడంతోనే..

శంకర్‌పల్లి మండలంలోని కొండకల్ రోడ్డు వద్ద శనివారం ఓ కారు కాల్వలోకి దూసుకెళ్లింది. కొల్లూరు నుంచి మోకిలా వైపు వెళ్తున్న ఓ కారు కొండకల్ జడ్పీహెచ్‌ఎస్ దగ్గర హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో పక్కనే ఉన్న కాల్వలోకి వెళ్లింది. అందులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. కాగా ఆ కారును జేసీబీ సహాయంతో బయటికి తీసే క్రమంలో భారీగా ట్రాఫిక్ జామయ్యింది. హెచ్చరిక, సూచిక బోర్డులు లేకపోవడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని సంబంధిత శాఖ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

-చేవెళ్ల రూరల్, ఆగస్టు 3